

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి రేవెల్లి మహేశ్

# ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

**బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి రేవెల్లి మహేశ్**

చెన్నూర్, మే 27 : ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే నేరమా? ప్రజలకు న్యాయం చేయాలంటూ సోషల్ మీడియా వేదికగా స్పందించిన బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేశారని బీఆర్ఎస్ చెన్నూర్ పట్టణ సోషల్ మీడియా ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించినందుకే చెన్నూర్‌లోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది నాయకులపై అక్రమ కేసులు పెట్టారని అన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు గాలిపెల్లి రవి, కమటం మనోహర్, ఎండీ నయాబ్, షెంషీర్‌ఖాన్, రేవెల్లి రాజు, బోగె భారతి, సుద్దాల ప్రశాంత్, రేవెల్లి మహేశ్‌పై కేసులు చేశారని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ప్రశ్నించడం మానదు అని స్పష్టం చేశారు.

# మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



నెన్నెల: పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్

హాజీపూర్/నెన్నెల, మే 27 : పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమైన మాజీ సర్పంచ్‌లను పోలీసులు నిర్బంధించారు. మంగళవారం ఉదయం మంచిర్యాల జిల్లా హాజీపూర్, నెన్నెల మండలాల్లోని మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నదని మాజీ సర్పంచ్‌లు మండిపడుతున్నారు. సమస్యల పై శాంతియుతంగా నిర్వహించే కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టులాంటిదన్నారు.

కాసిపేట, మే 27 : కాసిపేట మండలంలోని బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లో చేపట్టే నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు ఆడె బాదు, కొరికొప్పుల ప్రమీలగౌడ్, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతిని ముందస్తు అరెస్టు చేశారు.



కాసిపేట: పోలీస్ స్టేషన్‌లో మాజీ ప్రజాప్రతినిధులు

# ఆటో డ్రైవర్ల అరెస్టు ..



కన్నెపల్లి : పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు

కన్నెపల్లి/కాసిపేట/మందమర్రి/సీసీసీ నస్పూర్, మే 27 : ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టే ధర్నాకు వెళ్లకుండా మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్, కన్నెపల్లి, కాసిపేట, మందమర్రి మండలాల్లోని ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో కన్నెపల్లి ఆటో యూనియన్ అధ్యక్షుడు పందిర్ల అంజయ్య, శ్రీనివాస్, ఆటో డ్రైవర్లు ఉన్నారు.



మందమర్రి: పోలీస్ స్టేషన్‌లో..



కాసిపేట: పోలీస్ స్టేషన్‌లో..

# సాగుకు సన్నద్ధం

## వర్షాలతో ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం

- మంచిర్యాల జిల్లాలో 3.33 లక్షలు.. ఆసిఫాబాద్ జిల్లాలో 4.45 లక్షల ఎకరాల్లో పంటలు
- పలు ప్రాంతాల్లో వ్యవసాయ పనులు మొదలుపెట్టిన రైతన్నలు
- అవసరమైన ఎరువులు, విత్తనాలను సమకూర్చే పనిలో వ్యవసాయ శాఖ



దండేపల్లి : గూడెంలో దక్కులు దున్నుతున్న రైతన్నలు

మంచిర్యాల, మే 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. పది రోజులుగా వాతావరణం చల్లబడింది. రోహిణి కార్తె ప్రారంభంతో పూర్తిస్థాయిలో వానకాలం మొదలైంది. దీంతో రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారు. దుక్కులు దున్నీ విత్తనాలు వేసేందుకు పొలం బాట పడుతున్నారు. ఈ వర్షాకాలం మంచిర్యాల జిల్లాలో 3,33,565 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు అవసరమైన విత్తనాలు, సేంద్రియ ఎరువులు, జిలుగ, జమును, పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. ఈ సీజన్‌కు దాదాపు 1.02 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం అవుతాయని భావిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం ఈసారి పెరగనుంది. గతేడాది 3.18 లక్షల ఎకరాల్లో సాగు కాగా.. ఈ ఏడాది 3.33 లక్షల ఎకరాల్లో సాగు పెరగనుంది. జిల్లాలో వరితోపాటు పత్తి ఎక్కువగా సాగయ్యే అవకాశాలు ఉన్నాయి. పత్తి 1,58,753 ఎకరాలు, వరి 1,58,161, కంది 1000 ఎకరాల్లో సాగు అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో ఈ సీజన్‌లో 4,45,049 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నారు. పత్తి 3,35,363 ఎకరాలు, వరి 56,861, పప్పు దినుసులు 30,430, ఇతర పంటలు 22,392 ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నాయి అంటున్నారు.


### పనులు మొదలుపెట్టిన అన్నదాతలు

గతేడాది ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యమయ్యాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆలస్యంగా కురిసిన వర్షాలతో పంటలు కూడా లేట్ అయ్యాయి. దీంతో యాసంగి పంటలు ఆలస్యంగా కోతకు వచ్చాయి. మార్చి, ఏప్రిల్‌లో రావాల్సిన దిగుబడి మే నెలలో వచ్చింది. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. కొన్ని చోట్ల మొన్నటి వరకు కోతులు కూడా కాలేదు. కానీ.. ఈసారి తొలకరి ముందే పలకరించింది. రోహిణికార్తె ప్రవేశించడం, మొన్నటి దాకా ఎండలతో మండిపోయిన వాతావరణం ఒక్కసారి చల్లబడడంతో రైతులు పనులు మొదలుపెట్టారు. వేసవి దుక్కులు దున్ని, చేలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది పొడవునా సాధారణ వర్షపాతం నమోదు అవుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెప్పుండడం రైతులకు కలిసి రానుంది. మే నెలకు సంబంధించి ఇప్పటి దాకా 911.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, జూన్‌లో 195.2, జూలైలో 338.5, ఆగస్టులో 323.1, సెప్టెంబర్‌లో 130.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. గడిచిన రెండు, మూడేళ్లుగా ఆలస్యమైన రుతుపవనాలు ఈసారి ముందే రావడంతో సాగు పనులు సజావుగా జరుగుతాయని రైతులు భావిస్తున్నారు.

### నకిలీ విత్తనాలపై నజర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను నకిలీ పత్తి విత్తనాలు ముంచెత్తాయి. సీజన్ ప్రారంభానికి ముందే పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. రెండు, మూడు నెలల క్రితమే ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో విత్తనాలు పట్టుపడ్డాయి. క్వింటాళ్ల కొద్ది విత్తనాలు దొరికాయి. తాజాగా ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లోనూ పలుచోట్ల నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు అన్ని విత్తన షాపులను తనిఖీలు చేస్తున్నారు. గ్లైసిస్ పత్తి విత్తనాలు కొనుగోలు చేయవద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టర్ పర్యవేక్షణలో వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ బృందాలు అన్ని మండలాల్లో తనిఖీలు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ మేరకు కొన్ని నెలల ముందుగానే రైతులకు చేరిన విత్తనాలపై ఆరా తీయాలని, నకిలీ గ్లైసిస్ పత్తి విత్తనాలు సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


**మంచిర్యాల జిల్లాలో సాగు అంచనా..**




**మంచిర్యాల జిల్లాలో ఎరువులు అంచనా (మెట్రిక్ టన్నులు)**

| యూరియా | డీఏపీ | కాంప్లెక్స్ | ఎంఓపీ | ఎస్ఎస్‌పీ |
|---|---|---|---|---|
| 43,953 | 13,305 | 33,344 | 8,353 | 3,308 |

**ఆసిఫాబాద్ జిల్లాలో సాగు అంచనా..**




**ఆసిఫాబాద్ జిల్లాలో ఎరువులు అంచనా (మెట్రిక్ టన్నులు)**

| యూరియా | డీఏపీ | కాంప్లెక్స్ | ఎంఓపీ | ఎస్ఎస్‌పీ |
|---|---|---|---|---|
| 60,081 | 40,054 | 20,000 | 10,013 | 20,027 |

# ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

**కొండాపూర్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుల ఆందోళన**

కొండాపూర్ యాపలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కాసిపేట, మే 27 : మండలంలోని కొండాపూర్ యాప రహదారి పూర్తిగా ధ్వంసమై దెబ్బతిన్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడంపై మంగళవారం కొండాపూర్ యాప చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య మాట్లాడుతూ ప్రజలు గుట్టల్ని దాటి చెరువులా మారిన రహదారిలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని తెలిపారు. తాత్కాలిక మరమ్మతులు వారం కూడా నిలవడం లేదని, శాశ్వత పరిష్కారంగా బీటీ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రహదారి సమస్యను నెల రోజుల్లో పరిష్కరించకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్ అండ్‌బీ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ నేతలు, స్థానిక ఎమ్మెల్యే ప్రజల కష్టాలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ ఉపసర్పంచ్‌లు బోయిని తిరుపతి, సుమన్, పోడేటి సుమన్, ఆడె జనార్దన్, రాజేశ్, నాయకులు అగ్గి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాస్‌దేవ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు మంజులారెడ్డి, మడావి అనంతరావు, కైలాస్, కరీం, జాడి రాంచందర్, రేణుక, ధర్మయ్య, రమేశ్, రాజాగౌడ్, మల్లేశ్, శ్రీకాంత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అలా ధర్నా.. ఇలా మరమ్మతులు

*కాసిపేట మండలంలోని కొండాపూర్ యాప చౌరస్తాలో రోడ్డు అధ్వానంగా తయారై ప్రజలు పడుతున్న ఇబ్బందులపై స్పందించి ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధమైంది. అలా ధర్నాకు పిలుపు నిచ్చారో లేదో వెంటనే రాత్రి నుంచి చకచకా రోడ్డుకు మరమ్మతు పనులు చేస్తున్నారు. ఇలా తాత్కాలికంగా రోడ్డు వేయడం కాదని, శాశ్వత రోడ్డు వేసే వరకు ఆందోళనలు కొనసాగుతాయని బీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశారు.*

*- కాసిపేట, మే 27*



కొండాపూర్‌లో రాత్రి సమయంలో చేపడుతున్న మరమ్మతు పనులు

# రైస్‌మిల్లర్లు నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- అధికారులతో సమావేశం

నస్పూర్, మే 27 : రైస్ మిల్లర్లు 2024-25కు సంబంధించి సీఎంఆర్ డెలివరీ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ డెలివరీ, పెండింగ్ ఏసీకే లక్ష్యాలను పూర్తి చేసి యాసంగికి సంబంధించి ధాన్యం ప్రక్రియ ప్రారంభించాలన్నారు. అధికారులు, రైస్‌మిల్లర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. 2022-23 యాసంగికి సంబంధించి ధాన్యం వేలంలో వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని, లేని పక్షంలో తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఆర్ఐ మురళీకృష్ణ, అధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

### సర్వేయర్లు నిబంధనలు పాటించాలి

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంలో పొందుపర్చిన ప్రతి అంశాన్ని లైసెన్స్‌డ్ సర్వేయర్లు పూర్తిగా తెలుసుకుని ఉండి నిబంధనలు పాటించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాలలోని ఉషోదయ పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా సర్వే భూ రికార్డుల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, అసైన్డ్ భూములు, ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్‌లైన్ సర్వే వంటి వివిధ సందర్భాలు ఉంటాయన్నారు. శిక్షణలో ప్రతి అంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్